క్లుప్తంగా

సీఆర్పీల సంఘం డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: హుస్నాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర సమగ్ర శిక్ష (సీఆర్పీ) ఉద్యోగుల సంఘం డైరీని సోమవారం మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. ఉద్యోగులు తమ సమస్యలను విన్నవిస్తూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు తమను క్రమబద్ధీకరించాలని సీఆర్పీలు గుర్తు చేశారు. అతి త్వరలో ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బాలకిషన్, కార్యదర్శి యాదగిరి, దయానంద్, మహేష్, సంజయ్, రాజశేఖర్, ఇందిర, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



అంతక్కపేట గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నాయకులు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలంలోని అంతక్కపేట, జనగామ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. జనగామకు రూ.10 లక్షలు, అంతక్కపేటకు రూ.10 లక్షలు కేటాయించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య మాట్లాడుతూ గ్రామాల్లోని అంతర్గత రోడ్లను రాష్ట్రం ప్రభుత్వం సీసీ రోడ్లుగా మారుస్తుందన్నారు. ఎన్నికల సమయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఇచ్చిన మాట ప్రకారం మండలానికి రూ.కోటి నిధులు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భానోతు జయరాం, సింగిల్ విండో వైస్ చైర్మన్ ఎగ్గిడి అయిలయ్య, ఎంపీటీసీ సభ్యురాలు రజిత, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ జిల్లా ప్రతినిధిగా రాజు



పల్లె రాజును సన్మానిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు భద్రయ్య

చిన్నకోడూరు(సిద్దిపేట): జాతీయ మానవ హక్కుల కమిటీ సిద్దిపేట జిల్లా అధికార ప్రతినిధిగా మండల పరిధిలోని రామంచ గ్రామానికి చెందిన పల్లె రాజు నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు మొగుళ్ల భద్రయ్య రాజుకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ జాతీయ మానవ హక్కుల కమిటీ సంస్థ అవినీతి, అక్రమాలపై పోరాటం చేస్తుందన్నారు. తనపై నమ్మకంతో పదవి ఇచ్చిన రాష్ట్ర అధ్యక్షుడు, జిల్లా, రాష్ట్ర బాధ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రాజు పలువురు సన్మానించి అభినందించారు.

చెట్లను తొలగించాలి



వినతి పత్రం ఇస్తున్న నాయకులు

సిద్దిపేటరూరల్: ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే కొనోకార్పస్ చెట్లను వెంటనే తొలగించాలని ఎస్ఎఫ్‌డీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌డీఎఫ్ జిల్లా కన్వీనర్ ప్రణయ్ కుమార్ మాట్లాడుతూ ఏబీవీపీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు స్టూడెంట్ ఫర్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో కొనోకార్పస్ చెట్లను తొలగించాలని వినతి పత్రాలు అందజేస్తున్నామన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని సముద్రాల సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఎల్కతుర్తి-సిద్దిపేట రోడ్డు విస్తరణ పనుల దృష్ట్యా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 నిమిషాల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టీఎస్ఎస్‌పీడీఎల్ అసిస్టెంట్ ఇంజనీర్ మనోజ్‌కుమార్ తెలిపారు. కోహెడ క్రాసింగ్, లక్ష్మీపూర్, బత్తులవానిపల్లి, నాగసముద్రాల గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలన్నారు.

హుస్నాబాద్ మున్సిపల్ బడ్జెట్ రూ.35.65 కోట్లు

- మున్సిపాలిటీకి ప్రభుత్వ నిధులు తెచ్చే బాధ్యత నాది
- నీటి పన్నులు వసూలు పాలకవర్గ ఇష్టం
- మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: హుస్నాబాద్ మున్సిపాలిటీ బడ్జెట్ ప్రత్యేక సమావేశం సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా మంత్రి పొన్నం ప్రభాకర్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను సాధారణ అంచనా బడ్జెట్, 2023-2024 ఆర్థిక సంవత్సరం సవరణ బడ్జెట్ ఆమోదానికి బడ్జెట్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 2024-25లో అంచనా సాధారణ వ్యయం రూ.5.74 కోట్లు, 2025 మార్చి 31వ తేదీ నాటికి అంచనా మిగులు బడ్జెట్ రూ.2.42 లక్షలు, 2024-25 సంవత్సరంలో అంచనా పెట్టుబడి, ఆదాయ వ్యయాలు రూ.2.95 కోట్లు, డిపాజిట్లు, అడ్వాన్స్‌లు రూ.26.97 కోట్లు, మొత్తం మున్సిపల్ బడ్జెట్ రూ.35.65 కోట్లకు పాలకవర్గం ఆమోదం తెలిపింది. నీటి పన్నులు బాగా పెండింగ్‌లో ఉన్నాయని, ఈ పన్నులను ఎందుకు వసూలు చేయడం లేదని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అధికారులను ప్రశ్నించారు. ఇందుకు కొందరు సభ్యులు కలుగజేసుకొని మిషన్ భగీరథ నీటిని ఉచితంగానే ప్రభుత్వం సరఫరా చేస్తోందని ప్రజలు ఎవరూ బిల్లులు చెల్లించడంలేదని సమాధాన మిచ్చారు. ఆదాయ వనరులను సమకూర్చకుండా అదనంగా పారిశుద్ధ్య కార్మికులు కావాలని అడగడం ఏమిటన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు కాకుండా ఆదాయ వనరులపై దృష్టి సారించాలన్నారు.

నీటి పన్నులు వసూలు మీ ఇష్టం

పాలకవర్గంలో గౌరవ సభ్యుడిగా ప్రజా ప్రాతినిధ్యం వహిస్తున్నప్పుడు ప్రజలను చైతన్యపర్చడం, ప్రజలకు సౌకర్యాలు కల్పించడం తమ బాధ్యత అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సంస్థ నడపడానికి అవసరమైన పన్నులు వసూలు చేసుకోవడం కనీస బాధ్యతన్నారు. ఆ బాధ్యత పక్కన పెట్టి కొత్తగా వచ్చిన మంత్రి తీర్మానాలు చేయమన్నారు, వసూలు చేయమన్నారనే పరిస్థితి తేవద్దని సూచించారు. నీటి పన్నులు వసూలు చేసుకుంటారా లేదా అనేది మీ పాలకవర్గ ఇష్టమన్నారు. అభివృద్ధికి సంబంధించి ఇప్పటికే మున్సిపల్ శాఖ, రాష్ట్ర స్థాయి అధికారులతో ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటుపై తనకు ఆలోచన ఉందన్నారు. ఇంటి నిర్మాణానికి అనుమతి తీసుకొని ఎన్ని ఫ్లోర్లు వేసినా ఒక్క ఫ్లోర్‌కే మాత్రమే డబ్బులు తీసుకుంటున్నారని, దీని ప్రొసీజర్ వెంటనే మార్చాలని మంత్రి ఆదేశించారు. మూడు రోజుల క్రితం సీఎం రేవంత్ రెడ్డి మున్సిపల్ శాఖపై సమీక్ష నిర్వహించారన్నారు. మున్సిపాలిటీకి ప్రభుత్వం నుంచి ఏమి తేవాలన్నది తన బాధ్యత అన్నారు. ఇటీవల జాతీయ రహదారి అధికారులతో సమీక్ష చేశానని, హుస్నాబాద్ టౌన్‌లో మెయిన్ రోడ్డులో ఉన్న చౌరస్తాలను సుందరీకరణ చేస్తారని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ రవీందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ రెడ్డి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధే ఎజెండాగా ముందుకు..

కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి



శంకుస్థాపన చేస్తున్న కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

దౌల్తాబాద్(దుబ్బాక): అభివృద్ధే ఎజెండాగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సీసీ రోడ్డు నిర్మాణానికి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీ, పబ్లిక్ మరుగుదొడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నిరుపేదల సంక్షేమం కోసం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాములు, ఎంపీటీసీ వనిత, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు లాలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

27న మరో రెండు పథకాలు

కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఎన్నికల ప్రచారంలో ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు మరో రెండు పథకాలను ఈ నెల 27వ తేదీన ప్రభుత్వం అమలు చేయనుందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రెండు పథకాలను అమలు చేసిందన్నారు. ఈనెల 27న మరో రెండు పథకాలు గృహలక్ష్మి పేరిట 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందించనున్నామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ స్టేట్ కోఆర్డినేటర్ దాసరి రాజు, యువజన పట్టణ అధ్యక్షుడు గయాజుద్దీన్, ఎన్ఎస్‌యూఐ వర్కింగ్ ప్రెసిడెంట్ రషీద్, నజ్జూ, ప్రభాస్ పాల్గొన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోండి

ఎంపీడీఓ జయరాం



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ జయరాం

అక్కన్నపేట(హుస్నాబాద్): గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనులు కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జయరాం అన్నారు. సోమవారం అక్కన్నపేట మండలం అంతక్కపేట శివారు గౌరవెల్లి ప్రాజెక్టులో భాగంగా కుడి కాలువలో పెరిగిన చెట్లు, ముళ్ల పొదల తొలగిస్తున్న పనులను పరిశీలించారు. పని ప్రదేశంలో కల్పిస్తున్న మౌలిక వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలు బ్యాంకు ఖాతాకు ఆధార్‌కార్డు అనుసంధానం చేయాలన్నారు. ఎండలు పెరుగుతున్నందున రైతులు ఉదయమే పనులు పూర్తి చేయాలని సూచించారు. గ్రామ పంచాయతీ ద్వారానే ఉపాధి హామీ కూలీలకు తాగునీరు అందించాలని కార్యదర్శులను ఆదేశించారు. ఆయన వెంట టెక్నికల్ అసిస్టెంట్ ఉమేష్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

రాష్ట్రపతి నిలయం సందర్శన



రాష్ట్రపతి నిలయంలో గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

గజ్వేల్‌రూరల్: క్షేత్ర పర్యటనలో భాగంగా గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించారు. సోమవారం ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జాతీయ సైన్స్ సంబరాల్లో భాగంగా ఈనెల 26 నుంచి 28 వరకు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించే అవకాశం విద్యార్థులకు కల్పించారన్నారు. ఈ పర్యటనలో నిర్వహించిన క్విజ్ పోటీలు, పుస్తక ప్రదర్శన, సైన్స్ ప్రదర్శనలో విద్యార్థులు పాల్గొన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ రమేష్‌బాబు, బాలరాజు, డాక్టర్ భవానీ, విజయభాస్కర్‌రెడ్డి, రామచంద్రం, డాక్టర్ కవిత, డాక్టర్ పెద్దిరాజు, లక్ష్మీ, నారాయణమ్మ, లావణ్య, రాజశేఖర్, కైలాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

జేసీబీ సీజ్: పోలీస్ స్టేషన్‌కు తరలింపు



సీజ్ చేసిన జేసీబీ

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలో కొనసాగుతున్న మట్టి అక్రమ దందాను అరికట్టేందుకు రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. సోమవారం మండలంలోని ముద్దాపూర్ శివారులో మట్టి తవ్వకాలు జరుపుతున్నారన్న విశ్వసనీయ సమాచారం అధికారులకు అందింది. ఈ మేరకు తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆర్ఐ సత్యనారాయణ మట్టి తవ్వకాలు జరుపుతున్న ప్రాంతానికి వెళ్లారు. ఆయనను చూసిన వెంటనే జేసీబీని వదిలి టిప్పర్లలో పారిపోయారు. జేసీబీని సీజ్ చేసి కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఐదు రోజుల కిందట జేసీబీతోపాటు రెండు టిప్పర్లను పట్టుకొని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆర్ఐ మాట్లాడుతూ మట్టి, ఇసుకను అక్రమంగా తరలించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

అర్హులకు భూ పంపిణీ చేయాలి

బెజ్జంకి(సిద్దిపేట): అర్హులందరికీ భూములు పంపిణీ చేయాలని కోరుతూ భూమిలేని నిరుపేదలు సోమవారం బెజ్జంకి తహసీల్దార్ శ్యాంకు వినతి పత్రాన్ని అందజేశారు. 2017లో అప్పటి ప్రభుత్వం గ్రామంలో 60.18 ఎకరాల భూమిని పేద దళిత కుటుంబాలకు ఇచ్చేందుకు సేకరించిందన్నారు. అర్హులైన తమకు ఇవ్వలేదని, గ్రామంలో విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఆర్‌ఓ నాగరాజమ్మ

సిద్దిపేటరూరల్: రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలలో భాగంగా పోస్టర్లు, బ్యానర్‌ను సోమవారం డీఆర్‌ఓ నాగరాజమ్మ ఆవిష్కరించారు. లీడ్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 27వ తేదీన సిద్దిపేట రూబీ నెక్లెస్ రోడ్‌లో 2కె వాకథాన్, ఫిబ్రవరి 28, 29, మార్చి1 వ తేదీల్లో ఆర్థిక అక్షరాస్యత సదరంను ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించనున్నట్లు లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యజిత్ తెలిపారు. సేవింగ్స్, పవర్ ఆఫ్ కాంపౌండింగ్, బ్యాంకింగ్ అవసరాలు, డిజిటల్, సైబర్ హైజీన్ అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **యోగాతోనే మానసిక ప్రశాంతత**



మాట్లాడుతున్న భిక్షమయ్య గురూజీ

గజ్వేల్‌రూరల్: యోగాతోనే మానసిక ప్రశాంతతతో పాటు ఆరోగ్యవంతులుగా ఉంటారని సత్యసాయి ధ్యానమండలి వ్యవస్థాపకుడు భిక్షమయ్య గురూజీ అన్నారు. పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యోగా, ధ్యానం చేయడం వల్ల ఆత్మ విశ్వాసం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు మధునాల శ్రీనివాస్, ఇస్మాయిల్, రాధాకృష్ణ, సూర్యారావు, చంద్రారెడ్డి, పండరి, విజయలక్ష్మీ, వినోద, సునీత తదితరులు పాల్గొన్నారు.

◆ **ఘనంగా నర్సింహస్వామి ఆలయ ఉత్సవాలు**

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని అల్లీపూర్ శివారు గుట్ట ఉగ్రనరసింహస్వామి ఆలయ ఉత్సవాలు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, అభిషేకం, హోమం వంటి పూజా కార్యక్రమాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకుడు నాగరాజు, యూత్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

◆ **ఘనంగా ధ్యాన నిష్కాశ్రమ వార్షికోత్సవం**

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గాగిల్లాపూర్‌లో గల ధ్యాన నిష్కాశ్రమ 60వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. శ్రీసద్గురు దయానంద స్వామి 103వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం గణపతి, నవగ్రహ గీతా యజ్ఞం, హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరబ్రహ్మ నందగిరి స్వామి, పరిశుద్ధానందగిరి స్వామి, జగదీశ్వరానంద స్వామి, శ్రీనివాసరెడ్డి, రాంరెడి

◆ **తహసీల్దార్ బదిలీ**

కొండపాక(గజ్వేల్): కొండపాక తహసీల్దార్‌గా సమీర్ అహ్మద్‌ను నియమిస్తూ సోమవారం రాత్రి 10 గంటలకు కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. కొండపాక తహసీల్దార్‌గా శనివారం బాధ్యతలు చేపట్టిన బాలరాజు సోమవారం రాత్రి బదిలీ అయ్యారు. చేర్యాల తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న సమీర్ అహ్మద్‌ను కొండపాకకు, కొండపాకలో తహసీల్దార్‌గా విధుల్లో చేరిన బాలరాజు చేర్యాలకు బదిలీ అయ్యారు. విధుల్లో చేరిన ఒకే రోజుకు బదిలీకావడం గమనార్హం. పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై నిఘా పెంచాలి

- అధికారులు పారదర్శకంగా విధులు నిర్వహించాలి
- గజ్వేల్ ఏసీపీ బాలాజీ



ములుగు పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందికి సూచనలిస్తున్న ఏసీపీ బాలాజీ

ములుగు(గజ్వేల్): గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటుచేయాలని గజ్వేల్ ఏసీపీ బాలాజీ ఆదేశించారు. సోమవారం ములుగు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. రికార్డులు, సీసీ కెమెరాలు, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల గురించి ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ములుగు ప్రాంతంలో పరిశ్రమలు, ఫ్యాక్టరీలు ఉన్నాయని, వివిధ రాష్ట్రాలకు చెందిన వారు ఇందులో కూలీలుగా పని చేస్తున్నారన్నారు. దీంతో ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి తదితర మత్తు పదార్థాలు రవాణా అయ్యే అవకాశముందన్నారు. దీనికి అడ్డుకట్ట వేసేందుకు పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సైబర్ నేరాలు, బాల్యవివాహాలు తదితర అంశాలపై అవగాహన సదస్సుల ద్వారా ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక తవ్వుకునేందుకు అనుమతి ఇవ్వాలి

వాగు పరిరక్షణ కమిటీ డిమాండ్



రాస్తారోకో చేస్తున్న ఆకునూరు గ్రామస్తులు

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని ఆకునూరు గ్రామంలో చేపట్టే నిర్మాణాలకు గ్రామ శివారు పెద్ద వాగు నుంచి ఇసుకను తవ్వుకునేందుకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆకునూరు పెద్ద వాగు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్, ఎంపీటీసీ సుంకరి శ్రీధర్ మాట్లాడుతూ గ్రామ శివారులోని పెద్ద వాగు నుంచి ఇసుకను గ్రామస్తులు నిర్మాణాలకు వినియోగించుకుంటున్నామన్నారు. ఇటీవల అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారంటూ ఓ ట్రాక్టర్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకొని కేసుపెట్టి నమోదు చేయడంతోపాటు ఇసుక రవాణా నిలిపివేశారన్నారు. దీంతో గ్రామంలో కొనసాగుతున్న నూతన నిర్మాణాలు నిలిచి తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామ వాగు ఇసుక తమకు చెందకుండా అధికారులు షరతులు విధించి ఇబ్బందులకు గురి చేయడం సబబు కాదన్నారు. గ్రామస్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణాలకు అనుమతివ్వాలని, లేనిపక్షంలో కలెక్టరేట్‌ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆకునూరు పెద్ద వాగు పరిరక్షణ కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయ గదులకు తాళాలు

- పత్తాలేని అధికారులు
- ఇన్‌చార్జి ఎంఈఓ ఎక్కడ?



తాళం వేసిన ఎంఈఓ గది

అక్కన్నపేట(హుస్నాబాద్): నవ్విపోదురుగాక నాకేంటి అన్న చందంగా అక్కన్నపేట మండల వనరుల కేంద్రం(ఎంఆర్‌సీ) కార్యాలయం తయారైంది. మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ భవనం ప్రధాన ద్వారం తలుపులు తెరిచి కార్యాలయంలోని గదుల తాళాలు తీయకపోవడం పరిపాటిగా మారింది. నిరుపయోగంగా ఉన్న ఈ భవనాన్ని ఇన్‌చార్జి ఎంఈఓ నరసింహారెడ్డి ఇటీవల ప్రారంభించారు. అప్పటి నుంచి ప్రతీరోజు కార్యాలయ ప్రధాన ద్వారం తెరించి లోపలి గదుల తాళాలు మాత్రం తీయడంలేదని స్థానికులు చెబుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉండాల్సిన సిబ్బంది సైతం అందుబాటులో లేకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా ప్రధాన ద్వారం తలుపులు తెరించి ఉండటంతో కుక్కలు, కోతులు సంచరిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. కాగా మండలానికి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న ఎంఈఓ నరసింహారెడ్డి కూడా రావడం లేదని ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై ఇన్‌చార్జి ఎంఈఓ నరసింహారెడ్డిని సాక్షి సంప్రదించగా నాలుగు మండలాలకు ఇన్‌చార్జి ఎంఈఓగా కొనసాగుతున్నానంటూ బదులిచ్చారు.

వెండి మొలతాడు అపహరణ

కొమురవెల్లి(సిద్దిపేట): గుర్తు తెలియని వ్యక్తులు వెండి మొలతాడు అపహరించిన సంఘటన కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో చోటు చేసుకుంది. సోమవారం ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం స్వామి వారి దర్శనానికి వచ్చిన నంగునూర్ మండలం గట్ల మల్యాలకు చెందిన పడాల ఎల్లయ్య గంగిరేణి చెట్టు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడు. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు అతడి పది తులాల వెండి మొలతాడు అపహరించారు.

అనుమతులున్న ఎరువులే విక్రయించాలి

సిద్దిపేట డీఏఓ శివప్రసాద్



గుందారంలో ఎరువుల స్టాక్‌ను పరిశీలిస్తున్న డీఏఓ శివప్రసాద్

బెజ్జంకి(సిద్దిపేట): అనుమతులు ఉన్న ఎరువులు, మందులను మాత్రమే విక్రయించాలని సిద్దిపేట డీఏఓ శివ ప్రసాద్ అన్నారు. బెజ్జంకితో పాటు రేగులపల్లె, గుండారం గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువులు, పురుగు మందుల లైసెన్స్‌లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొగి పురుగు, అగ్గి తెగులు నివారణకు రైతులు సస్యరక్షణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏఓ సంతోష్, ఏఈఓలు సాయి శంకర్, ఏటీఎం సాయి తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్‌కు ఘన స్వాగతం



స్వాగతం పలుకుతున్న బొమ్మ శ్రీరాం చక్రవర్తి

బెజ్జంకి(సిద్దిపేట): కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ కార్యదర్శి బండి సంజయ్ కుమార్‌కు మండలంలోని బెజ్జంకి క్రాసింగ్ వద్ద హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి బొమ్మ శ్రీరాంచక్రవర్తి సోమవారం ఘన స్వాగతం పలికారు. హుస్నాబాద్ నియోజకవర్గానికి ఎంపీ బెజ్జంకి క్రాసింగ్ నుంచి కాన్వాయ్‌లో వెళ్లారు.

హాస్టల్ భవనం కేటాయించాలని వినతి



వినతి పత్రం అందజేస్తున్న ప్రశాంత్

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవనాన్ని ఎస్సీ విద్యార్థులకు కేటాయించాలని కోరుతూ సోమవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ ప్రజావాణిలో కలెక్టరేట్ ఏఓ రహ్మాన్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవనంలో మహిళా డిగ్రీ కళాశాల జిల్లా కేంద్రానికి తరలించారన్నారు. ఆ భవనాన్ని స్థానికంగా ఉన్న ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు కేటాయించకుండా మరో మండల కేంద్రానికి చెందిన విద్యార్థులకు అప్పగించాలని చూడటం సరికాదన్నారు. సంబంధిత అధికారులు స్పందించి స్థానికంగా ఉన్న విద్యార్థులకు హాస్టల్‌ను కేటాయించి పోస్ట్ మెట్రిక్ హాస్టల్‌గా అప్‌గ్రేడ్ చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు భరత్, సమీర్, మధు, అర్జున్ పాల్గొన్నారు.